క్లుప్తంగా

కొడాలి నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

గుడివాడరూరల్: గుడివాడ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్ సీపీ తరఫున కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) గురువారం వేయనున్న నామినేషన్ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ మట్టా నాగమణి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ కోరారు. మండలంలోని లింగవరంలోని స్వగృహంలో బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన ఎమ్మెల్యే కొడాలి నాని ఇంటి వద్ద నుంచి ఉదయం నామినేషన్ వేసేందుకు బయల్దేరుతారని పేర్కొన్నారు. నామినేషన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

గుడివాడ టౌన్: గుడివాడ అసెంబ్లీకి వైఎస్సార్ సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్న కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) నామినేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నాయకులు బుధవారం తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక రాజేంద్రనగర్‌లోని ఎమ్మెల్యే కొడాలి నాని ఇంటి వద్ద నుంచి ర్యాలీ బయలుదేరుతుందని పేర్కొన్నారు. ర్యాలీ ఏలూరు రోడ్‌కు చేరుకున్న అనంతరం నెహ్రూచౌక్, మార్కెట్ సెంటర్, వాసవీచౌక్ నుంచి కవిరాజ కళామందిరం, ఏజీకే సెంటర్, పాత మున్సిపల్ ఆఫీస్, రాజుబాపయ్య చౌక్, పోస్టాఫీస్ రోడ్ మీదుగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుంటుందని తెలిపారు. గుడివాడ అర్బన్, రూరల్, నందివాడ, గుడ్లవల్లేరు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అన్ని విభాగాల అధ్యక్ష కార్యదర్శులు పెద్ద సంఖ్యలో పాల్గొని నామినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కైలే నామినేషన్ కార్యక్రమం జయప్రదం చేయండి



పమిడిముక్కల: పామర్రులో గురువారం ఉదయం 10గంటలకు జరిగే ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్ నామినేషన్ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సోదరి అనిత పేర్కొన్నారు. మండలంలోని మేడూరులో బుధవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి రెండు ఓట్లు ఫ్యాను గుర్తుపై వేసి ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే అభ్యర్థి కైలే అనిల్‌కుమార్‌ను గెలిపించాలని కోరారు. సర్పంచ్ గొరికేపూడి స్వర్ణలత, ఎంపీటీసీ సభ్యుడు నాగరాజు, నాయకులు బుజ్జి, మస్తాన్‌రావు, రాంబాబు, వంశీకృష్ణ పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నామినేషన్

పామర్రు: వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కైలే అనిల్‌కుమార్ నామినేషన్‌ను గురువారం ఉదయం 10 గంటలకు ఆర్వో కార్యాలయంలో అందజేయనున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది బుధవారం తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు, ప్రజా ప్రతినిధులు అందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

గుడివాడలో ఐదు నామినేషన్లు

గుడివాడ టౌన్: గుడివాడ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి శాసనసభకు పోటీ చేసేందుకు బుధవారం ఐదు నామినేషన్లు దాఖలైనట్లు రిటర్నింగ్ అధికారి పి.పద్మావతి తెలిపారు. సింగవరపు జోసఫ్ జైభీమ్ రావ్ భారత్‌పార్టీ తరఫున, పంది నాగరాజు నవరంగ కాంగ్రెస్ పార్టీ తరఫున, అంబేడ్కర్ గుండాబత్తిన, వేల్పూరి వేణుగోపాలరావు, మీగడ రాము స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్లు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

పామర్రులో..

పామర్రు: కృష్ణాజిల్లా 77వ అసెంబ్లీ ఎస్సీ నియోజకవర్గానికి బుధవారం ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి. వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కైలే జ్ఞానమణి తన రెండో నామినేషన్ పత్రాల సెట్‌ను పార్టీ నాయకులు గంగమ్ సురేష్‌తో ఆర్వో శ్రీదేవికి అందజేశారు. పెయ్యల రాజు పాల్గొన్నారు. టీడీపీ నాయకుడు వర్ల కుమార్‌రాజా తన నామినేషన్‌ను ఆర్వో శ్రీదేవికి అందజేశారు. రాజా తన పార్టీ బీ ఫాం పట్టాను టీడీపీ నేత వల్లూరిపల్లి గణేష్ చేత ఆర్వోకు అందజేయించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డీవై దాసు తన నామినేషన్‌ను ఆర్వోకు అందజేశారు. జై భీమ్‌రావ్ భారత్‌పార్టీ తరఫున కొడాలి సునీల నామినేషన్ దాఖలు చేశారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరఫున డి.అమర్‌నాథ్ నామినేషన్ వేశారని ఆర్వో తెలిపారు.

ఏఐటీయూసీ నూతన కార్యవర్గం ఎన్నిక

గుడివాడ టౌన్: ఏఐటీయూసీ ఆటోనగర్ విభాగం కార్యవర్గం ఎన్నిక బుధవారం జరిగింది. అధ్యక్షుడిగా జి. ముసలయ్య, కార్యదర్శిగా కె.సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు గూడపాటి ప్రకాష్ బాబు తెలిపారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని సీపీఐ గుడివాడ నియోజకవర్గ కార్యాలయంలో ఈ ఎన్నిక జరిగినట్లు ఆయన తెలిపారు. యూనియన్ నాయకులు రంజిత్‌కుమార్, బాలు, ధనుష్, సన్ని పాల్గొన్నారు.

పథకాల అమలు కోసం ఫ్యాన్ గుర్తుకే ఓటు

గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: కుల, మత, రాజకీయాలకతీతంగా పేదలందరూ ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టే సంక్షేమ పథకాలు అమలు అవుతాయని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. బుధవారం ఆయన శేరీ దగ్గుమిల్లి, చింతలగుంట, కట్టవానిచెరువు, తాడిచెర్ల, పురిటిపాడు, చినగొన్నూరులో ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబుకు ఓటేస్తే మన పిల్లలకు అందుతున్న ప్రతి లబ్ధి నిలిచిపోతుందన్నారు. బాబుకు ఓటేస్తే అన్నీ ముగింపులు, కత్తిరింపులేనని హెచ్చరించారు. ఓటేయడంలో ఏ మాత్రం పొరబాటు జరిగినా పేద కుటుంబాలు తీవ్రంగా నష్టపోతాయన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేస్తేనే అక్క చెల్లెమ్మలకు మేలు చేసే రాజ్యం కొనసాగుతుందన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న సీఎం జగన్‌కు మద్దతుగా నిలుస్తూ.. పెత్తందారులతో వస్తున్న చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కొడాలి పిలుపునిచ్చారు. ఐదేళ్లలో జరిగిన మంచిని చూసి ప్రజలందరూ అభివృద్ధికి అండగా నిలవాలన్నారు. ఆయనకు ప్రజానీకం పూలమాలలతో స్వాగతం పలికారు. అభివాదం చేస్తున్న ఆయన్ను మహిళలు అడుగడుగునా హారతులతో స్వాగతించారు. ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, నాయకులు పాలడుగు రాంప్రసాద్, గిరి బాబాయ్, కేజే విక్టర్ పాల్, సూరపనేని కల్యాణ్, దుగ్గిరాల శేషుబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శాయన రవి, పార్టీ యువజనాధ్యక్షుడు గుదే రవి, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత, ఎంపీపీ కొడాలి సురేష్, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు, మండల బూత్ కన్వీనర్ కోటప్రోలు నాగు, కొండలమ్మ ఆలయ చైర్మన్ శేషం గోపి, ఎంపీటీసీ సభ్యులు పూర్ణ కవిత, సోమేశ్వరరావు, దిలీప్, సర్పంచులుఅర్జునరావు, సాంబయ్య, లక్ష్మణరావు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రచారంలో అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



ఎమ్మెల్యే కొడాలి నానికి హారతి ఇస్తున్న మహిళ

వైభవంగా అంకమ్మతల్లి విగ్రహప్రతిష్ట

ముదినేపల్లి రూరల్: మండలంలోని వడాలిలో అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. పలు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. వేదపండితుల మంత్రోచ్చరణ, మంగళ వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ వైభవంగా ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేయగా నిర్వాహకులు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, సర్పంచ్ మరీదు దుర్గశ్రీ, వైఎస్సార్ సీపీ నాయకులు మోట్రు ఏసుబాబు, ఈడే వెంకటేశ్వరరావు, బత్తిన కిషోర్, బి.రవీంద్ర, సాక్షి సాయిబాబు, దూసన ప్రవయ్యదాసు పాల్గొన్నారు.



అంకమ్మతల్లికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

వృద్ధులకు చీరల పంపిణీ



గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం సేవా కార్యక్రమాల్లో భాగంగా కరుణా పీఠం వృద్ధాశ్రమంలో వృద్ధులకు బుధవారం చీరలు పంపిణీ చేశారు. తాతా నాగ వెంకట రాజేష్-ప్రభావతి దంపతుల వితరణతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం మాజీ సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్, ఆర్యవైశ్య ప్రముఖులు బొగ్గారపు తిరుపతయ్య, యలమర్తి వెంకట కృష్ణారావు, హరిబాబు, జాజుల తాతారావు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



తోట్లవల్లూరు: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు సాగుతూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని తోట్లవల్లూరు ఎంపీపీ ఈడ్పుగంటి రాజ్యామణి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాల్లో సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, ఎంపీడీఓ సత్యనారాయణ, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సాయిప్రసన్న, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈలు రాఘవరావు, వెంకటేశ్వరరెడ్డి, ఏఓ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎంపీఏ రాత పరీక్షలు ప్రారంభం



కూచిపూడి(మొవ్వ): పొట్టి శ్రీ రాములు తెలుగు విశ్వవిద్యాలయం పరిధిలోని శ్రీ సిద్ధేంద్రయోగి కూచిపూడి నాట్యకళాపీఠంలో ఎంపీఏ (మాస్టర్ ఆఫ్ పర్ఫార్మింగ్ ఆర్ట్స్) నాలుగు, రెండో సెమిస్టర్ రాత పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు జరిగిన కూచిపూడి నాటక క్రమ వికాసం పేపర్‌కు 17 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాపీఠం ప్రిన్స్‌పాల్, పరీక్షల పర్యవేక్షణా అధికారి డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి తెలిపారు. ఈ పరీక్షలకు ఇన్విజిలేటర్‌గా డాక్టర్ చింతా రవి బాలకృష్ణ వ్యవహరించారు.

వేగంగా నేషనల్ హైవే విస్తరణ పనులు

మండవల్లి: విజయవాడ-భీమవరం నేషనల్ హైవే విస్తరణ పనులు ఆర్‌అండ్‌బీ అధికారులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు. మండవల్లిలో బుధవారం విస్తరణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

ఈ పనులు పూర్తి కావడానికి సుమారు రెండేళ్లు పడుతుందని సూపర్‌వైజర్ నాగరాజు పేర్కొన్నారు. భీమవరం-విజయవాడ మధ్యన గల పట్టణాలు, గ్రామాల్లో విస్తరణ పనులు కొనసాగుతున్నాయి.



మండవల్లిలో నిర్వహిస్తున్న నేషనల్ హైవే విస్తరణ పనులు

అధిక మార్కుల సాధనకు చేతిరాత ముఖ్యం

మచిలీపట్నంటౌన్: ప్రతి విద్యార్థీ అధిక మార్కులు సాధించేందుకు అందమైన చేతిరాత ఎంతో అవసరమని జాతీయ కాలీగ్రఫీ నిపుణుడు పి.బి.చంద్ర సూచించారు. నగరంలోని జవ్వారుపేట శ్రీ వేంకటేశ్వర ఇంగ్లిషు మీడియం హైస్కూల్‌లో బుధవారం చేతిరాత ఉచిత వేసవి శిక్షణను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదవటం ఎంత ముఖ్యమో పరీక్షల్లో సమయానికి తగ్గట్టుగా వేగంగా, అందంగా రాయటం అంతే కీలకమని సూచించారు. ఎదుటి వారికి అర్థమయ్యేలా రాయటం ఎంతో అవసరమన్నారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్, ఉపాధ్యాయులు ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే పదో తేదీ వరకు ఉదయం ఎనిమిది నుంచి 11.30 గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయని వివరించారు. స్కూల్ ప్రిన్సిపాల్ ఎం సత్యనారాయణ పాల్గొన్నారు.



చేతిరాత శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్ర

కనులపండువగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ట

గూడూరు: మండలంలోని రాయవరంలో శ్రీ అయ్యప్పస్వామి విగ్రహ ప్రతిష్ట బుధవారం కనులపండువగా జరిగింది. స్థానిక శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి, శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ ప్రాంగణంలో నారగం వెంకటరత్నం, కమల దంపతుల చేతుల మీదుగా అయ్యప్ప విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరిగింది. గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వార్ల శిఖర జీవ యంత్ర సహిత నూతన ఆలయ ప్రతిష్ట కార్యక్రమం వేడుకగా సాగింది. ఎ.మధుసూదన్ నంబూద్రి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. గురువారం ఉదయం స్వాముల ఇరుముడుల సమర్పణ కార్యక్రమం జరుగుతుందని శ్రీ ధర్మ శాస్త సేవాసమితి తెలిపింది.



ఆలయంలో కొలువు దీరిన శ్రీ అయ్యప్ప స్వామి

పుష్కలంగా తాగునీటి సరఫరా

మచిలీపట్నంటౌన్: నగర ప్రజలకు ఈ వేసవిలో తాగునీటిని పుష్కలంగా సరఫరా చేస్తామని మునిసిపల్ కమిషనర్ సీహెచ్.వి.వి.ఎస్.బాపిరాజు తెలిపారు. తరకటూరు సమ్మర్ స్టోరేజీ ట్యాంకులో నీటి నిల్వలను ఆయన బుధవారం పరిశీలించారు. నగర ప్రజలకు రోజు విడిచి రోజు తాగునీరు సరఫరా చేస్తున్నామన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈస్ట్ రైవస్ కాలువ ద్వారా దాదాపు 15 రోజుల పాటు వచ్చిన నీటితో ట్యాంకును పూర్తి సామర్థ్యం మేర నింపామని పేర్కొన్నారు. నగరంలోని పుట్లమ్మచెరువును కూడా నింపామన్నారు. జూన్‌లో కాలువలు వచ్చే వరకు ఈ నీరు నగర ప్రజలకు తాగునీటి సరఫరా చేసేందుకు పూర్తిస్థాయిలో సరిపోతాయని వివరించారు.



తరకటూరు సమ్మర్ స్టోరేజీలో నీటి నిల్వలను పరిశీలిస్తున్న కమిషనర్ బాపిరాజు

కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభం

మచిలీపట్నంటౌన్: నగరంలోని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను హిందూ విద్యాసంస్థల చైర్మన్ డి.జి.శాస్త్రి, ప్రెసిడెంట్ కొనకళ్ల నారాయణరావు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యత పెరిగిందని దీనికి అనుగుణంగా కళాశాలలో నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించామని పేర్కొన్నారు. ల్యాబ్‌ను ప్రతివిద్యార్థీ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. హిందూ విద్యాసంస్థల పాలకమండలి సభ్యుడు శాస్త్రి, డిగ్రీ కళాశాల, హిందూ కళాశాల, ఎంబీఏ కళాశాల, లా కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్స్ అన్నపూర్ణ, కుటుంబరావు, షిఫాలి, రాయల్, శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గంగానమ్మ ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ

జమీదగ్గుమిల్లి(పామర్రు): పామర్రు మండలంలోని జమీదగ్గుమిల్లిలోని గంగానమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. తొలుత పాత ఆలయంలో ఉన్న అమ్మవారిని బాలాలయంలోకి తరలించి, అక్కడ అమ్మవారిని ప్రతిష్ఠించారు. అనంతరం గత ఆలయం ఉన్న స్థలంలో నూతన ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కె.చంద్రశేఖర్ రావు మాట్లాడుతూ గ్రామస్తుల సహకారంతో పునర్నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. సుమారు రూ.30లక్షల వరకు ఖర్చు అవుతుందని అంచనా వేశామన్నారు. దాతలు మరింతగా సహకరించాలని కోరారు.



ఆలయ పునర్నిర్మాణానికి పూజాధికాలను నిర్వహిస్తున్న భక్తులు

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం

ముదినేపల్లి రూరల్: పేదలకు ప్రభుత్వ సంక్షేమాలు సమర్థవంతంగా అమలు చేయాలంటే ముఖ్యమంత్రి జగనన్న వల్లే సాధ్యపడుతుందని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) కోడలు దూలం స్వాతి, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ అన్నారు. మండలంలోని దాకరంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), కారుమూరి సునీల్‌కుమార్‌యాదవ్ తరఫున ఎన్నికల ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పథకాలు తిరిగి మరింత సమర్థవంతంగా అమలుకావాలంటే జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. జరగబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న డీఎన్నార్, సునీల్‌కుమార్‌యాదవ్‌కు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించి జగనన్న తిరిగి ముఖ్యమంత్రి అయ్యేందుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా స్వాతి, నాయకులకు గ్రామస్తులు భారీ ఎత్తున మద్దతు తెలియజేశారు. కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



దాకరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న దూలం స్వాతి, నాయకులు

పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీకి మళ్లీ అవకాశం

గుడివాడరూరల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్ పేర్కొన్నారు. మండలంలోని రామనపూడి, తటివర్రు గ్రామాల్లో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)కి మద్దతుగా బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించి మరోసారి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ భట్టు నాగమల్లేశ్వరి, వైఎస్సార్ సీపీ నాయకులు చిన్ని సత్యదుర్గాప్రసాద్, ఏలేటి ఆంజనేయులు(ఆగస్టిన్), పవన్‌కుమార్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



రామనపూడిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఉప్పాలకు అభినందనలు తెలిపిన నాయకులు



ఉప్పాల రాము, హారిక దంపతులను అభినందించిన నాయకులు



ఉప్పాల రాముకు మద్దతు తెలుపుతున్న నూతన వధూవరులు

గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న ఉప్పాల రాము, జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక దంపతులకు బుధవారం పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు అభినందనలు తెలిపారు. అభినందనలు తెలిపిన వారిలో వేమవరం కొండలమ్మ ఆలయ మాజీ చైర్మన్ కనుమూరి రామిరెడ్డి, నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, నాయకులు బొడ్డు రమేష్, కందుల నాగరాజు ఉన్నారు.

నూతన వధూవరుల మద్దతు ఉప్పాలకే..

గుడ్లవల్లేరు: వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ అభ్యర్థిగా నామినేషన్ వేసేందుకు వేమవరం కొండలమ్మ ఆలయానికి వచ్చిన ఉప్పాల రాము, జెడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక దంపతులకు బుధవారం అదే ఆలయంలో దర్శనం చేసుకుంటున్న నూతన వధూవరులు మద్దతు పలికారు. అన్ని వర్గాల ప్రజల సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతుగా ఉంటారని నూతన దంపతులు చెప్పారు.

అధ్యాపకురాలు రజినీకి డాక్టరేట్

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కాలేజీలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న వి.రజిని గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పట్టాను అందుకున్నారు. ఆమెను బుధవారం ఆ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు అభినందించారు. 'ఫార్ములేషన్ అండ్ ఎవాల్యుయేషన్ ఆఫ్ బై లేయర్డ్ టాబ్లెట్స్ ఆఫ్ సమ్ సెలెక్టెడ్ యాంటీ డయాబెటిక్ డ్రగ్స్' అనే అంశంపై సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించినందుకు డాక్టర్ రజినీకి పట్టాను అందించారని ప్రిన్సిపాల్ తెలిపారు. కాలేజీ చైర్మన్ డాక్టర్ వల్లూరుపల్లి నాగేశ్వరరావు, కార్యదర్శి సత్యనారాయణరావు, సహ కార్యదర్శి రామకృష్ణ, అధ్యాపకులు డాక్టర్ ఎస్‌కే అమీనాబీ, డాక్టర్ పి.రవీష, డాక్టర్ టి.ప్రశాంతి అభినందించారు.



టీడీపీ అభ్యర్థి నామినేషన్ సమయంలో ధన ప్రవాహం



పామర్రులో ఆర్వోకు నామినేషన్ అందజేస్తున్న టీడీపీ అభ్యర్థి కుమార్ రాజా

- మద్యం దుకాణాల వద్ద తెలుగు తమ్ముళ్ల సందడి
- పోలీసులతో గొడవకు దిగిన టీడీపీ నాయకులు

పామర్రు: పామర్రు టీడీపీ అభ్యర్థిగా వర్ల కుమార్‌రాజా బుధవారం తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి బి.శ్రీదేవికి కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలను తీసుకొచ్చేందుకు నాయకులు డబ్బును విచ్చలవిడిగా ఖర్చు చేశారు. తమ నాయకుడి నామినేషన్‌కు రావాలని నియోజకవర్గంలోని అన్ని గ్రామాల ప్రజలను అభ్యర్థించినా ప్రజలు ఆసక్తి చూపలేదు. దీంతో పేలవంగా నామినేషన్ ర్యాలీ జరిగింది. చాలా గ్రామాల నుంచి టీడీపీ నాయకులు కార్యకర్తలు వచ్చిన దాఖలాలు లేవు. ఒక్కొక్కరికి రూ.300 ఇచ్చి నామినేషన్ కార్యక్రమానికి విచ్చల విడిగా నగదును ఖర్చు పెట్టారు. గ్రామ స్థాయిలోని పసుపు నాయకులు స్థానికులకు ముందుగానే నగదు ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. ర్యాలీకి ఆశించినంత మంది రాకపోవడంతో ఆ పార్టీ మండల నాయకుల్లో అసంతృప్తి నెలకొంది. అసలే నియోజకవర్గంలో టీడీపీకి ఎదురుగాలి వీస్తోందని, దీనికి తోడు నామినేషన్‌కు వచ్చేందుకు ప్రజలు ఆసక్తి చూపక పోవడంతో ఆ పార్టీ నాయకులు డీలా పడ్డారు. అదేవిధంగా టీడీపీ కార్యకర్తలు బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంతోపాటు రహదార్ల వెంబడి వెళ్లే వారిని ఇబ్బందులకు గురి చేశారు. టీడీపీ నాయకులు విచ్చల విడిగా డబ్బు, మద్యం సరఫరా చేసి విజయం కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నా ఫలితం లేదని స్థానికులు చర్చించుకున్నారు. నామినేషన్ సమయంలో బారికేడ్లను దాటేందుకు టీడీపీ శ్రేణులు పోలీసులతో వాగ్వాదానికి తెగబడ్డారు. పోలీసుల హెచ్చరికలతో వెనక్కి తగ్గారు.



మద్యం దుకాణం వద్ద తెలుగు తమ్ముళ్లు



బార్‌కేడ్‌ల వద్ద పోలీసులతో టీడీపీ నాయకుల వాగ్వాదం